మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# తెలంగాణ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తుంది:మంత్రి

**నారాయణపేట,నవంబరు 26 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తుందని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం మక్తల్ మున్సిపాలిటీలో మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. ఈ రోజు మక్తల్ మున్సిపాలిటీ కేంద్రంలో సుమారు రూ.5కోట్ల అంచనా వ్యయంతో 2.77 కి.మీ. సిసి రోడ్లు, 2.84 కి.మీ. మురుగు కాల్వల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 2014 తర్వాత ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ దేశంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు మన్నె శ్రీనివాస్‌రెడ్డి,మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ కోయశ్రీహర్ష,మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## యువతీ,యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి...

**వనపర్తి కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా**

**వనపర్తి ప్రతినిధి,నవంబర్ 26 ప్రభాతవార్త:** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 26, 27, డిసెంబర్ 3,4వ తేదీలలో నిర్వహించే శిబిరాల దాక వరా 18 సంవత్సరాలు పూర్తయిన ప్రతి ఒక్కరు ఓటర్ గా తమ పేరును నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. శనివారం వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ మైనార్టీ బాలికల కళాశాల, బందార్ నగర్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ నమోదు క్యాంపెయిన్ పోలింగ్ బూత్ లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రాల వారిగా అర్హులైన నూతన ఓటర్లను గుర్తించాలని, 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు, దివ్యాంగులను, ట్రాన్స్ జెండర్ లను ఓటర్లుగా నమోదు చేయాలని ఆమె సూచించారు. ఫామ్-6ద్వారా నూతన ఓటర్ల ను నమోదు చేయాలని, ఫామ్-6(బి), ఫామ్-7, ఫామ్-8 ద్వారా ఓటర్ల జాబితా వివరాలలో మార్పులు, చేర్పులకు అవకాశంకల్పించడం జరుగుతుందని ఆమె వివరించారు. బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికి వెళ్లి, సర్వే ద్వారా ఓటర్ నమోదు చేయాలని, చనిపోయిన వారి వివరాలను జాబితా నుండి తొలగించాలని ఆమె తెలిపారు ఓటర్ శిబిరాల వద్ద బూత్ లెవెల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది అందుబాటులో ఉండాలని అధికారులకు ఆమె సూచించారు. కలెక్టర్ వెంట ఎంఆర్ఓ రాజేందర్ గౌడ్, తదితరులు ఉన్నారు.



ఓటర్ నమోదు కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

# అధికారులు సమన్వయంతో పని చేయాలి..!

**రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్**

**నారాయణపేట,నవంబరు 26 ప్రభాతవార్త :** ప్రభుత్వం కల్పిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖమంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. శనివారం నారాయణపేట జిల్లా శీలగార్డెన్‌లో జరిగిన జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశాల్లో ప్రజా ప్రతినిధులు అధికారులను ప్రశ్నించడం, నిలదీయడమే ధ్యేయంగా కాకుండా ప్రభుత్వం ద్వారా కల్పిస్తున్న సంక్షేమ అభివృద్ధి ఫలాలు క్షేత్రస్థాయిలో ప్రతిఒక్కరికి అందే విధంగా సమన్వయంతో పనిచేసి ఏ సమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. రాష్ట్రంలో విద్యా, వైద్యానికి, వ్యవసాయానికి, సంక్షేమానికి దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అగ్రతాంబూలం ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి వ్యక్తికి స్వచ్ఛమైన తాగునీరు, మూడు పంటలకు సాగునీరు, అన్ని జిల్లాలకు వైద్య కళాశాలలు, వైద్యాలయాలు, మన ఊరు మనబడి కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేసుకోవడం జరుగుతుందన్నారు. కొత్తగా ఏర్పడిన నారాయణపేట జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి జిల్లా రూపురేఖలు మార్చడానికి ఎమ్మెల్యే విశేషంగా కృషి చేస్తున్నారని కితాబునిచ్చారు. నారాయణపేట జిల్లాలోని ప్రతి ఎకరానికి కాలువ ద్వారా సాగునీరు ఇచ్చేందుకు త్వరలో ఒక బృహత్ ప్రణాళిక తయారు చేసి ఆమోదించుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ధాన్యం సేకరణ జరుగుతుందని ఎక్కడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ ధాన్యం సేకరణ పూర్తిచేయాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు. జిల్లాలో వైద్యులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చేరేవిధంగా చూడాలని సూచించారు.పార్లమెంట్ సభ్యులు మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న అభివృద్ధి సంక్షే పథకాలను చేరే విధంగా చూడాలని సూచించారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ వనజమ్మ, స్థానిక ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, జెపి డిప్యూటి సీఈఓ జ్యోతి, జడ్పీటిసిలు, కోఆప్షన్ సభ్యులు, ఎంపిపిలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.




26ఎంబిఎన్ఆర్ 9: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- రాష్ట్ర దేవాదాయశాఖ కమీషనర్ అనిల్‌కుమార్
- పాలకమండలి సభ్యులతో అభివృద్ధి పనులపై సమీక్ష
- జరుగుతున్న పనుల పరిశీలన

**దేవరకద్ర.నవంబరు 26 ప్రభాతవార్త:** మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటే శ్వరస్వామి దేవస్థానం వద్ద జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమీషనర్ అనిల్‌కుమార్ సూచించారు. మన్యంకొండ దేవస్థానాన్ని శనివారం రాష్ట్ర దేవాదా యశాఖ కమీషనర్ అనిల్‌కుమార్ సందర్శించారు. దేవస్థానానికి వచ్చిన కమీషనర్‌కు దేవస్థాన ం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్, ఈఓ. పురేందర్‌కు మార్.పాలకమండలి సభ్యులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేవస్థానం వద్ద జరుగుతున్న పనులను కమీషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ వచ్చే మన్యంకొండ జాతరను దృష్టిలో పెట్టుకొని జరు గుతున్న పనులను వేగవంతం చేయాలన్నారు. నాణ్యత విషయంలో ఎట్టిపరిస్థితిలో రాజీపడే ప్రసక్తేలేదన్నారు. ఈ సందర్భంగా దేవస్థానంలో జరుగుతున్న వసతి గదుల నిర్మాణపనులతో -మిగతా2లో..



మన్యంకొండలో పనులను పరిశీలిస్తున్న దేవాదాయశాఖ కమీషనర్ అనిల్‌కుమార్

# దళిత జాతిబాంధవుడు సీఎం కేసీఆర్..!

**- దళితులు ఆత్మగౌరవంగా బతికేందుకే దళితబంధు.. - వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, నవంబర్ 26, ప్రభాతవార్త:** దళితుల అభ్యున్నతి కోసం 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో దళితుల కోసం అనాడు అంబేద్కర్ ఆలోచన చేస్తే ఈనాడు సీఎం కేసీఆర్ దళితులు ఆత్మ గౌరవంగా బతికేందుకే దళిత బంధు పథకాన్ని తీసుకొచ్చారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం చారకొండ మండల కేంద్రంలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ప్రభుత్వ విఫ్ గువ్వల బాలరాజు, ఎంపీ పోతుగంటి రాములు, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌లతో కలిసి మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా మండల కేంద్రంలోని భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రూ.22 లక్షలతో నిర్మించిన రైతు వేదికను, రూ.3కోట్ల 32 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ నూతన భవనాన్ని మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. అదే విధంగా పైలెట్ ప్రాజెక్టు క్రింద 269 మందికి మంజూరైన 27 కోట్లతో 112 కార్లు, 139 ట్రాక్టర్లు, 18 గూడ్స్ వాహనాల యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భగవంతుడు తనకు అవకాశం ఇస్తే ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతున్న గురుకులాల్లో తాను విద్యార్థిగా చదువాలని కోరుకుంటానని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక విద్య,వైద్యంపై ముందు చూపుతో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక గురుకులాలను ప్రారంభించారన్నారు. దేశంలో పద్ద పెద్ద దొంగలను పట్టించిన హీరో గువ్వల బాలరాజు అని కొనియాడారు. దళితులు నిరాధారణకు గురై ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటు తనానికి గురయ్యారని, వారి స్థితిగతులను మార్చడానికే రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు దళితబంధు రూపంలో హక్కును కల్పించి ఆదుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మానసపుత్రిక దళితబంధు పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో 4 మండలాలను ఎంపిక చేసి అందులో చారకొండ మండలం ఉండటం విశేషమని ఆయన అన్నారు. కేసీఆర్‌కు సాటి ఎవ్వరు లేరని, రాష్ట్రంలో సంపదను పెంచేందుకు 75శాతం వ్యవసాయం రాష్ట్రంలో నదుల ద్వారా సాగునీరు అందించి 24 గంటల ఉచిత విద్యుత్, పెట్టుబడి సహాయం క్రింద రైతుబంధు, రైతు భీమా అందించి ప్రజలకు భరోసా కల్పిస్తున్నారన్నారు. దేశానికి అన్నం పెట్టే స్థాయికి అత్యధిక వార్షికదాయం కలిగిన రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం నేడు దేశంలోనే అగ్రగామీగా నిలిచిందని ఆయన అన్నారు. అవకాశం కల్పిస్తే కష్టపడి పనిచేసి ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు మరికొంత మందికి ఉపాధి కల్పిస్తారని భావించి దళితబంధు పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు. ఇప్పటి వరకు 9 విడతలుగా రైతుబంధును అందజేశామని, 65 లక్షల మంది రైతులకు రైతుబంధు అందిందన్నారు. రైతుబంధు, దళితబంధు, ఉచిత విద్యుత్ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తునా న్నయన్నారు. కొత్త మండలాల్లో గోదామ్‌లు మంజూరవుతాయని, రాష్ట్రంలో ఇతర మండలాలతో పాటు నూతనంగా ఏర్పడిన మండలాలకు కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉండే విధంగా మండల కా ంప్లెక్స్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ కల్వకుర్తి ఎమ్మెల్యే, గ్రామ పెద్దల సహకారంతో కల్వకుర్తి, అచ్చంపేట నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలను కలిపి చారకొండ మండలంగా ఏర్పాటు చేయడమైందన్నారు. చారకొండ మండలంలోని ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు యూనిట్ ఇప్పించే బాధ్యత తనదేనని భరోసానిచ్చారు. కొత్తగా వివాహాలైన కుటుంబాలకు సైతం లబ్ధిచేకూరే విధంగా మంత్రిని చూడాలన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు దేశ వ్యాప్తంగా డిమాండ్ చేసే విధంగా ఉన్నాయన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో ప్రవేశ పెట్టని పథకాలో తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని, దళితులను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకే దళితబంధు పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని చారకొండ మండలంలోని ప్రతి దళితకుటుంబానికి రూ.10లక్షలు విలువ చేసే యూనిట్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తైన - మిగతా2లో..



రైతు వేదికను ప్రారంభిస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎంపీ రాములు, ఎమ్మెల్యేలు, జెడ్పీవైస్ చైర్మన్



మంత్రికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



దళితబంధు లబ్ధిదారుడికి వాహనాన్ని అందజేస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎంపీ రాములు, ఎమ్మెల్యేలు, జెడ్పీవైస్ చైర్మన్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

# ఈ వార్డెన్.. మాకొద్దు..!



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

పరీక్షలకు రక్తం శాంపిల్స్ సేకరిస్తున్న దృశ్యం

**నీళ్లచారు, పురుగుల అన్నం తినలేక బాలికలకు అస్వస్థత**

**ఈ అన్నం తినలేమంటున్న విద్యార్థులు**

**బాలికలను బెదిరింపులకు గురి చేస్తున్న వార్డెన్**

**బాలికల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న డిటి యాదయ్య, తహసిల్దార్ ఆంజనేయులు**

**మహ్మదాబాద్,నవంబరు 26 ప్రభాతవార్త :** బాలికల షెడ్యూల్ కులాల ఆనంద నిలయంలో వండిపెడుతున్న పురుగుల అన్నం తినలేక ఎవరికి చెప్పుకోలేక ఉపవాసంతో స్కూలుకు వెళ్లడంతో స్కూల్లోనే స్పృహ తప్పి పడిన ఏడుగురు బాలికలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందిన ఘటన మహ్మదాబాద్ మండల పరిధిలోని షెడ్యూల్ కులాల బాలికల ఆనంద నిలయంలోని బాలికల దీనగాథ. పూర్తి వివరాల్లోకి వెళ్తే మహ్మదాబాద్ మండల పరిధిలోని షెడ్యూల్ కులాల ఆనంద నిలయంలో 60 మంది విద్యార్థినిలు ఉంటూ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు. అయితే హాస్టల్లో ఉంటున్న ఏడుగురు బాలికలు శనివారం పాఠశాల ఆవరణలో స్పృహ తప్పికింద పడిపోవడంతో పాఠశాల సిబ్బంది మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్లూకోజ్‌లు పెట్టి చికిత్స అందించారు. ఘటనపై విద్యార్థులను వివరాలు అడగగా మోను పాటించకుండా పురుగుల కూడే వండి పెడుతుండడంతో తినలేక ఎవరికి చెప్పుకోలేకపోతున్నాని, గత రెండు మూడువారాల నుండి పురుగుల అన్నం,నీళ్లచారు, పులిహోరలో పసుపు వేసి ఉడికి ఉడకని అన్నం పెడుతున్నారని, విద్యార్థులు ఆరోపించారు. ఈ వార్డెన్ మాకు వద్దు అంటూ విద్యార్థులు ఆరోపిస్తున్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న బాలికలను డిప్యూటి డైరెక్టర్ యాదయ్య, తహసిల్దార్ ఆంజనేయులు ఆరోగ్య కేంద్రంలో విద్యార్థుల ఆరోగ్యంపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై డిప్యూటి డైరెక్టర్‌ను వివరణ అడగగా ఈ ఘటనకు సంబంధించిన పూర్తివివరాలు హాస్టల్లో విద్యార్థులు వచ్చాక పూర్తిగా అడిగి తెలుసుకుని చర్యలు తీసుకుంటామని తెలిపారు. -మిగతా2లో..



డాక్టర్లను వివరాలు అడిగి తెలుసుకుంటున్న దృశ్యం

## ప్రజా సమస్యలను గాలికి వదిలిన అధికార యంత్రాంగం..

- అధికారులపై ఎంపీపీ ఆగ్రహం
- సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- ఎంపీపీ భీమమ్మ

**వంగూరు,నవంబర్26,ప్రభాతవార్త:** గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని, అధికారులు ప్రజా సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యంవహిస్తే సహించేదిలేదని ఎంపీపీ భీమమ్మ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం వంగూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ భీమమ్మలాలుయాదవ్ -మిగతా2లో..




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భీమమ్మ

## నాణ్యమైన వైద్యం అందించి ఆసుపత్రిపై భరోసా కల్పించాలి

**నారాయణపేట,నవంబరు 26 ప్రభాతవార్త :** ఆసుపత్రికి వచ్చే రోగులను ఆదరించి సరైన సమయంలో వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయహర్ష వైద్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఉదయం జిల్లా కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీచేశారు. వచ్చినరోగులు, వారికి అందిస్తున్న వైద్య సేవలను పరిశీంచారు. ఆసుపత్రికి వచ్చే రోగులు తమ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ వస్తారని వారికి సరైన సమయంలో నాణ్యమైన వైద్యాన్ని అందించినప్పుడే వాళ్లు ఆరోగ్యవంతులుగా తయారవుతారన్నారు. వైద్యులు సమయానికి ఆసుపత్రికి చేరుకోవాలన్నారు.ఆసుపత్రిలో ఉన్న వివిధ వైద్య విభాగాలను పరిశీలించి -మిగతా2లో..



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

## ఇంటింటికి వెళ్లి కొత్త ఓటర్ల నమోదు చేయాలి:కలెక్టర్

**మహబూబ్‌నగర్,నవంబరు 26 ప్రభాతవార్త :** ఎన్నికల పోలింగ్ కేంద్రాల బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి జనవరి 1, 2023 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరిని గుర్తించి కొత్త ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావు ఆదేశించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ 2023 కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తిరుమలదేవునిగుట్ట, పోలీస్‌లైన్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు.ఈసందర్భంగా ఓటరు జాబితాను, జాబితాలో -మిగతా2లో..



ఓటరు జాబితా సవరణను పరిశీలిస్తున్న కలెక్టర్

## శానిటేషన్‌పై శ్రద్ధ వహించండి..

### మురికి కాల్వలను శుభ్రం చేయాలి..

### జిల్లా పంచాయితీశాఖ అధికారి సురేష్ కుమార్..

**ఖిల్లాఘణపురం,నవంబర్ 26 ప్రభాతవార్త:** గ్రామాల్లో శానిటేషన్ పనులపై ప్రత్యేక శ్రద్ద వహించాలని శనివారం జిల్లా పంచాయితీశాఖ అధికారి సురేష్ కుమార్ ఆకాంక్షించారు. సామాజిక తనిఖీల్లో భాగంగా మండల కేంద్రంలో శానిటేషన్ పనులను డీపీఓ సురేష్ కుమార్ పరిశీలించారు. పారిశుద్య కార్మికులు క్రమం తప్పకుండా మురికి కాల్వలు శుభ్రం చేయాలని అన్నారు. ప్రజలు చెత్తను రోడ్లపై వేయరాదని చెత్త సేకరించి గ్రామపంచాయితీ ట్రాక్టర్లకు అందివ్వాలని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, ఉపసర్పంచ్ యాదగిరి, పంచాయితీ కార్యదర్శి రవితేజ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మురికి కాల్వలను పరిశీలిస్తున్న డీపీఓ సురేష్ కుమార్

## ఓటర్ నమోదు కేంద్రాలను పరిశీలించిన ఎంఆర్‌ఓ

**వనపర్తి రూరల్,నవంబర్ 26 ప్రభాతవార్త:** వనపర్తి మండలంలోని సవాయిగూడెం, చిమనగుంటపల్లి గ్రామాలలో ఓటర్ నమోదు కేంద్రాలను పరిశీలించిన వనపర్తి ఎంఆర్‌ఓ రాజేందర్ గౌడ్ ఈ సందర్భంగా ఓంఆర్‌ఓ రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ ఓటర్ నమోదు ప్రత్యేక దినములను పురస్కరించుకొని శనివారం, ఆదివారం అందరు బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌ఓఎస్) తప్పనిసరిగా ఉదయం 9గంటల నుండి సాయంకాలం 5గంటల వరకు మీ మీ పోలింగ్ కేంద్రాలలో కొత్త ఓటర్ లిస్టు పెట్టుకొని కుర్చి, టేబుల్ వేసుకొని ఫారం-6 ద్వారా కొత్త ఓటర్లను నమోదు చేయాలని అన్నా రు. 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు కొత్తగా ఓటు హక్కును పొందడానికి బూతు లెవెల్ అధికారులను సంప్రదించి ఓటు హక్కును పొందగలరని తెలిపారు. అదే విధంగా జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ, డివిజన్ ఆఫీసర్ లు శనివారం, ఆదివారం పోలింగ్ కేంద్రాల ను సందర్శిస్తారు అని తెలిపారు.



ఓటు నమోదు చేస్తున్న అధికారులు

## కౌకుంట్లలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

**దేవరకద్ర,నవంబరు 26 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం కౌకుంట్లలో శనివారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండు ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషన్‌రావు, తుమ్మల శేఖర్‌రెడ్డి, కేబీఆర్ గౌడ్, ఉపసర్పంచ్ నరసింహ్మలు, పంచాయతీ కార్యదర్శి శేఖర్, సాంభశివుడులతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ సిబ్బంది, గ్రామపెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



కౌకుంట్లలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

## నాణ్యమైన వైద్యం అందించి ఆసుపత్రిపై భరోసా కల్పించాలి

మొదటిపేజీ తరువాయి భాగం...

రోజువారిగా వచ్చే వివరాలను ఓపి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్థో, డెంటల్, ప్రసూతి వార్డులను తనిఖీ చేశారు. పేర్లను నమోదు చేసిన తరువాత వారి పేరు నమోదు అనంతరం ఏ డాక్టర్‌దగ్గర వైద్య పరీక్షలు చేయించుకోవాలి వారికి గల ఇబ్బందులను క్షుణ్ణంగా నమోదు చేయాలన్నారు. జిల్లా కేంద్రానికి పిహెచ్‌సి సెంటర్‌ల గర్భిణీ బాలింతలు వైద్య పరీక్షలకై వచ్చే వివరాలను ఎప్పటికప్పుడు పొందుపర్చాలన్నారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఎక్స్‌రే, రక్త పరీక్షలు ఇతరత్రా పరీక్షలు నిర్వహించి వారికి సరైన వైద్యం అందించాలన్నారు. నాణ్యమైన వైద్యం అందించి ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రిపై భరోసా కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రంజిత్‌కుమార్, ఈఎంఓ డా. పావని, డా. ఆదిత్య పాల్గొన్నారు.

## ఇంటింటికి వెళ్లి కొత్త ఓటర్ల నమోదు చేయాలి

మొదటి పేజీ తరువాయి భాగం...

చేపట్టిన సవరణలు, రిజిస్టర్లను, ఓటరు నమోదుకై కొత్తగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. చనిపోయిన ఓటర్ల పేర్లను జాబితా నుండి తొలగించడంలో జాగ్రత్తగా పరిశీలించాలని అలాగే ఈఆర్‌ఓ వ్యక్తిగతంగా పరిశీలించిన తర్వాతే ఏదైనా పేరును జాబితా నుండి తొలగించాలని చెప్పారు. బిఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి జనవరి 1,2023 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండే ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని ఆదేశించారు. ఈ విషయలో మున్సిపాలిటీలో శానిటేషన్ వాహనాలద్వారా పెద్దఎత్తున కొత్త ఓటర్ల నమోదుపై ప్రచారం కల్పించాలని చెప్పారు. అలాగే మున్సిపల్ వార్డు అధికారులను కూడా ఇందులో భాగస్వామ్యం చేసి ఇళ్లిల్లు తిరిగి 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటరు నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని మహబూబ్‌నగర్ అర్బన్ తహసిల్దార్ పార్థసారథిని ఆదేశించారు.

## నేడు టీఆర్‌ఎస్ పార్టీ ఉమ్మడి మండల కార్యకర్తల సమావేశం

**-టీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టినరసింహ్మారెడ్డి - హాజరుకానున్న ఎమ్మెల్యే ఆల**

**దేవరకద్ర,నవంబరు 26 ప్రభాతవార్త:** దేవరకద్రలో ఆదివారం టీఆర్‌ఎస్ పార్టీ ఉమ్మడి మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు టీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టినరసింహ్మారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్ద ఉదయం 11కు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. కావున ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతి నిధులు, అనుబంధ సంఘాల నాయకులు అధికసంఖ్యలో పాల్గొనాలని జెట్టినరసింహ్మారెడ్డి కోరారు.



జెట్టినరసింహ్మారెడ్డి

# దళిత అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం..

**వనపర్తి టౌన్,నవంబర్ 26 ప్రభాతవార్త:** భారతరాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని వనపర్తి జిల్లా కేంద్రంలోని కర్రెమ్మ గుడి దగ్గర దళిత అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. నేటితో భారత రాజ్యాంగం దినోత్సవం 72 వసంతాలు పూర్తి చేసుకుంది మరి ఆనాడు స్వతంత్ర పోరాటంలో ఎందరో మహానీయులు అందరు వారి ప్రాణాలను త్యాగం చేసి స్వతంత్రాన్ని సాధించారు. అట్టి స్వతంత్ర భారతానికి ఒక పవిత్రమైన రాజ్యాంగం పరిపాలన విధానం రూపొందించుటకై డా.బాబా సాహెబ్ అంబేద్కర్ అధ్యక్షతన రాజ్యాంగ రచన కమిటీ ఏర్పడింది రాజ్యాంగ రచన కమిటీకి చైర్మెన్ గా ఉన్న డా.బీ.ఆర్ అంబేద్కర్ నిరంతరం శ్రమిస్తూ రాజ్యాంగాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఎంతో ఉన్నతమైన విలువలతో కూడిన రాజ్యాంగాన్ని ప్రపంచం కీర్తించే విధంగా ఘనపరిచే విధంగా గుర్తించే విధంగా గొప్ప రాజ్యాంగాన్ని రూపొందించి భారతదేశానికి అంకితం చేసిన రోజు నవంబర్ 26వ తేదీన భారత రాజ్యాంగ దినోత్సవంగా నిర్వహించుకుంటున్న భారతదేశ పరిపాలన విధానానికి చుక్కాని వంటిదేనని అన్నారు. భారత రాజ్యంగం పౌరుల యొక్క హక్కులు విధి విధానాలు పరిపాలన పద్దతులు, తదితర అంశాలు ఎన్నో రూపొందించి చక్కని భారత రాజ్యాంగాన్ని అందించిన డా.బీ.ఆర్ అంబేద్కర్ నివాళి అర్పిస్తూ యావత్ జాతి నేడు రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవడం సంతోషకరమని దళిత అభివృద్ధి సంఘం నాయకులు కొనియాడారు. దేశంలోని ప్రతి పౌరుడు కూడా రాజ్యాంగాన్ని చదవాలని రాజ్యాంగ పీఠికను అర్థం చేసుకోవాలని రాజ్యాంగం యొక్క సారంశం అంతా రాజ్యాంగ పీఠికలోనే ఉందని అందుకోసం రాజ్యాంగ పీఠిక పై ప్రమాణం చేసి నేడు రాజ్యాంగ పీఠికను చదువుతూ ప్రతిజ్ఞ చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో దళిత అభివృద్ధి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి, ఉపాధ్యక్షులు జీటీ శ్యామ్, కోశాధికారి బంకలి ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు ఈరపోగు రవి, విజయ్ బాబు, డి.మహేష్, కేశవులు, నారాయణ, రామకృష్ణ, వెంకటేష్, రామదాసు, తదితరులు పాల్గొన్నారు.



భారత రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్న దళిత సంఘం నాయకులు



డా.బీ.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

**ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం..**

**ముఖ్యమంత్రి కేసీఆర్‌కు**

**రాజ్యాంగం పట్ల, అంబేద్కర్ పట్ల విశ్వాసం లేదు...**

**వనపర్తి టౌన్,నవంబర్ 26 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పట్టణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ మాట్లాడుతూ భారతదేశం పెద్ద ప్రజాస్వామ్య దేశమని దేశ స్వాతంత్ర్యం అనంతరం భారదేశానికి ఒక రాజ్యాంగం తప్పనిసరి అని భారతదేశంలో పేదరికం, సమానత్వం, వివక్ష, అభివృద్ది ఇవన్నీ కూడగట్టుకొని బాబా సాహెబ్ అంబేద్కర్ తన మేధాశక్తితో కమిటీ సభ్యులతో కలిసి రాజ్యాంగాన్ని రచించడం జరిగిందని అన్నారు. ఆ రాజ్యాంగం తోనే నేడు భారతదేశం ప్రపంచ దేశంలో గర్వకారణంగా ముందుకు పోతున్నామని అలాంటి రాజ్యాంగాన్ని మనందరం గౌరవించాలి కానీ ఈ మధ్య కాలంలో ముఖ్యమంత్రి కేసీఆర్ రాజ్యాంగం పనికిరాదు పాతదైపోయిందని నేను కొత్త రాజ్యాంగాన్ని రచిస్తానని పదాలు పలికారు ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత రావడంతో నేను అలా అనలేదని చెప్పారని ఆయప ఎద్దేవ చేశారు. ముఖ్యమంత్రి కి రాజ్యాంగం పట్ల గాని అంబేద్కర్ పట్ల గానీ విశ్వాసం లేదు అంబేద్కర్ ఎంతో మేధాశక్తితో రాజ్యాంగాన్ని రచిస్తే విమర్శ చేయడం ఇది సరైన విధానం కాదని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు రామ్మోహన్, బీజేపీ ప్రధాన కార్యదర్శి బుడ్డన్న, రామన్ గౌడ్, పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శి సూగూరు రాము, రాయన్న సాగర్, బీజేపీ నాయకులు మహేందర్, కిసాన్ మోర్చ జిల్లా నాయకులు జ్ఞానేందర్, జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు వెంకటేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి...

**వనపర్తి టౌన్,నవంబర్ 26 ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ 2014, 2018 ఎన్నికలలో ముస్లిం, మైనార్టీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ జన సమితి పార్టీ వనపర్తి జిల్లా అధ్యక్షులు ఎం.ఏఖాదర్ పాష డిమాండ్ చేశారు. ఆయన నివాసంలో జన సమితి నాయకులతో సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో ముస్లింలకు 12%రిజర్వేషన్ ఇస్తామని చెప్పిన మాటలు సీఎం కేసీఆర్ ముస్లింలకు ఇచ్చిన హామీలు, తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ముస్లింల సమస్యల మీద కూలంకషంగా చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా ఖాదర్ పాష మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ముస్లింలకు ఇచ్చిన హామీలు గత ఎనిమిదిన్నర ఏళ్లు పూర్తయిన కూడా ఇంకా నెరవేరలేదు వాటిని ఇకనైనా నెరవేర్చి ముస్లిం మైనార్టీల పట్ల తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం దృష్టికీ ముస్లింల యొక్క తీసుకువస్తున్నామం అని 12% రిజర్వేషన్ హామీ అటకెక్కిందని వెంటనే రిజర్వేషన్లు పెంచుతూ గెజిట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు, కేసీఆర్ ప్రభుత్వంలో కూడా వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని దీనిని ఆపడానికి వక్ఫ్ బోర్డుకు జ్యుడిషనల్ పవర్ కల్పించాలని అన్నారు. తాళం వేసిన వక్ఫ్ బోర్డు రికార్డుల రూమ్ ను తక్షణమే తెరవాలని అన్నారు. గత 3ఏళ్లుగా ఖాళీగా ఉన్న మైనార్టీ కమిషన్ ను వెంటనే నియమించాలని తెలిపారు. నెలల కొద్దిగా పెండింగ్‌లో ఉన్న ఇమామ్, మౌజమ్ ల జీతాలను వెంటనే చెల్లించాలని అన్నారు. మైనార్టీ కార్పోరేషన్ నిధులు లేక వెలవెల బోతుందని వెంటనే నిధులు విడుదల చేసి పేద ముస్లిం చిరు వ్యాపారులకు రూ.2లక్షల సబ్సిడీల్లోనూ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుధీర్ కమీషన్ సూచనలు అమలు చేయాలని అన్నారు. ముస్లిం బంధు కూడా అమలు చేయాలని, ముస్లింలకు షాదీ ముబారక్ గల 3ఏళ్లుగా పెండింగ్ లోన్న చెక్కులను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జనసమితి టౌన్ అధ్యక్షులు కె.రఘు నాయుడు, టౌన్ ప్రధాన కార్యదర్శి శాంతారామ్ ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షులు ఎం.ఎ ఖాదర్ పాష

## మిషన్ భగీరథ పంప్‌హౌస్‌ను పరిశీలించిన బీఎస్పీ నాయకులు

**శ్రీరంగాపురం,నవంబర్ 26 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో గత నాలుగు రోజులుగా మంచినీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఎస్పీ నాయకుల దృష్టికి వెళ్లగా టౌన్ బీఎస్పీ కన్వీనర్ కె.భాస్కర్ ఆధ్వర్యంలో శనివారం మిషన్ భగీరథ పంప్‌హౌస్ సందర్శించి వివరాలు తెలుసుకోగా 7నెలల క్రితం ఒక మోటార్ కాలిపోయిందని దానిని షెడ్డుకు పంపగా దాని బదులు వేరే మోటర్ పంపించారు. కానీ దాన్ని మెకానిజం సూట్ కాక పక్కన పడేశారు. రెండు మోటర్లు నడుస్తున్న క్రమంలో గత నాలుగు రోజుల క్రితం మోటర్ కు సంబందించిన పంప్ కాలిపోగా దాన్ని షెడ్డుకు పంపగా అదీ రాలేదు. పైగా ఇక్కడ నడుస్తున్న ఒకే ఒక్క మోటర్ యొక్క పంపు కూడా రెండు రోజుల క్రితం కాలిపోగా దానిని షెడ్డుకు పంపగా గత నాలుగు రోజుల నుండి నీటి సరఫరా సరిగ్గా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ అధికారులు నిర్లక్ష్యాన్ని బీఎస్పీ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, ఇక గ్రామ పంచాయితీకి చెందిన ట్యాంకర్ నీళ్లు తెచ్చిన పట్టుకోలేక చాలా మంది ఇంట్లో పిల్లలు లేని వృద్దులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయితీ వారు కూడా గ్రామంలో ఉన్న బోర్ల ద్వారా నాళ్లాలకు నీళ్లు వదిలే విధంగా ప్రత్యామ్నాయాలు ఏర్పాటు చేయాలని ప్రజలు సూచిస్తున్నారు. మిషన్ భగీరథ ప్రభుత్వ అధికారులను ఫోన్ లో సంప్రదించగా శనివారం రాత్రి వరకు వాటర్ సప్లైని రీస్టోర్ చేయడానికి ప్రయత్నిస్తున్నామని పంప్ హౌస్ లో ఉన్న మోటర్ ఫ్రీక్వెంట్ గా రిపేర్ వస్తున్నందున కొత్త మోటర్ లు కావాలని పై అధికారులకు ప్రపోజల్ పంపగా 15 రోజుల్లో కొత్త మోటర్ లు పంపడానికి హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా బీఎస్పీ సోషల్ మీడియా కన్వీనర్ బహుజన రమేష్, నియోజకవర్గ పార్టీ ప్రధాన కార్యదర్శి, మండల ఎంపీటీసీ గూడెం ఎల్లస్వామి, పార్టీ సీనియర్ నాయకులు ఆర్.పి.బీసన్న, ట్రైలర్ కురుమన్న, బోరవెల్లి శాంతయ్య పాల్గొన్నారు.



మిషన్ భగీరథ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎంపీటీసీ ఎల్లస్వామి

### ప్రజా సమస్యలను గాలికి

## వదిలిన అధికార యంత్రాంగం..

మొదటిపేజీ తరువాయి భాగం...

అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సర్పంచ్‌లు చేపట్టిన పనులకు పంచాయతీ కార్యదర్శులు సకాలంలో నివేధికలు చేపట్టకపోవడంతో బిల్లులు రాక నానా అవస్థలు పడుతున్నామని తిరుమలగిరి, ఉమ్మాపూర్, పోతారెడ్డిపల్లితో పాటు జాజాల గ్రామాల సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకొచ్చారు. మిషన్ భగీరథ నీళ్ల గ్రామాల్లో సరఫరా కాకపోవడం ఒక ఎత్తైతే, మరికొన్ని గ్రామాల్లో సరఫరా అవుతున్న కలుషిత నీరు సరఫరా కావడం పట్ల ప్రజలు అనారోగ్యం భారిన పడుతున్నారనే విషయాన్ని మిషన్ భగీరథ అధికారులకు విన్నవించిన ఫలితం లేకుండా పోతుందని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనులకు పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు ఎంబీ, రికార్డులు చేయకపోవడం వల్ల సకాలంలో బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి పనులు చేపట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని, అధికారులు చొరవ తీసుకొని బిల్లులు సకాలంలో వచ్చే విధంగా చూడాలన్నారు. అనంతరం ఎంపీపీ భీమమ్మ మాట్లాడుతూ సర్పంచ్‌లు చేసిన పనులకు అధికారులు నిర్లక్ష్యం వహించకుండా ఎంబీ రికార్డులు చేసి బిల్లులు సకాలంలో అందే విధంగా చూడాలని ఆమె సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజా ప్రతినిధులు అధికారులకు విన్నవిస్తే నిర్లక్ష్యం వహించకుండా పూర్తి చేసి ప్రజలకు న్యాయం చేయాలని ఆమె సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మి చెక్కులను అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీఓ పవన్‌కుమార్, జిల్లా కోఆప్షన్ సభ్యులు హామీద్, వైస్ ఎంపీపీ సంధ్యా నర్సింహ్మారెడ్డి, టీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, మాజీ మండల అధ్యక్షులు గణేష్‌రావు, ఎంపీటీసీ రమేష్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లయ్యయాదవ్, కేటీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఆంకు సురేందర్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు అంజి, సర్పంచ్‌లు లావణ్య ఎల్లగౌడ్, బుజ్జి, మల్లయ్య, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

మొదటిపేజీ తరువాయి భాగం...

పాటు పలు పనులను కమీషనర్ పరిశీలించారు.

**పాలకమండలి సభ్యులతో సమీక్ష..** దేవస్థానం చైర్మెన్ చాంబర్‌లో సంబందిత అధికారులు, పాలకమండలి సభ్యులతో దేవాదాయశాఖ కమీషనర్ అనిల్‌కుమార్ సమీక్షనిర్వహించారు. ఈసందర్భంగా వారితో మాట్లాడి పలు అంశాలపై చర్చించారు. దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్, ఈఓ పురేందర్‌కుమార్‌లను అడిగి అన్ని విషయాలు అడిగి తెలుసుకొన్నారు. అదేవిదంగా దేవస్థానంలోని భక్తుల క్యూలైన్లు, కళ్యాణమండపం షెడ్డు తదితర వాటిని కమీషనర్ స్వయంగా పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. వచ్చే స్వామివారి భ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం దేవస్థాంలో కమీషనర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటి కలెక్టర్ ఎల్.రమాదేవి, ఉమ్మడి జిల్లా ఇంచార్జి సహాయకమీషనర్ శ్రీనివాసరాజు, దేవాదాయశాఖ ఎస్‌ఈ మల్లికార్జున్‌రెడ్డి, ఏఈ బాలయ్య, పాలకమండలి సభ్యులు శ్రీనివాస్, చిన్నయ్యగౌడ్, నిరంజన్‌చారి, పురుషోత్తం, హేమంత్, ప్రమోద్‌లతో పాటు దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దళిత జాతిబాంధవుడు సీఎం కేసీఆర్..!

మొదటి పేజీ తరువాయి భాగం...

దళితులు బాగు పడలేదని గ్రహించిన సీఎం కేసీఆర్... దళితబంధు పథకాన్ని ప్రవేశ పెట్టారని ఎంపీ పోతుగంటి రాములు పేర్కొన్నారు. రైతుబంధు, దళితబంధు, త్వరలో గిరిజన బంధు, బీసీ బంధు పెట్టనున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజాబంధువుడిగా పేరు తెచ్చుకుంటున్నారని కొనియాడారు. చారకొండ మండలంలో 1407 దళితకుటుంబాలను గుర్తించి అందరికి ఉచితంగా దళితబంధు యూనిట్లు అందిస్తున్నామని, చారకొండ మండల ప్రజలకు రెండు రోజుల ముందే దసరా పండుగను తీసుకొచ్చారన్నారు. దళితుల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి దళితబంధు పథకాన్ని ప్రవేశ పెట్టి దళితుల జీవితాల్లో వెలుగులు నింపారని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. దళితులంటేనే చిన్న చూపు చూస్తే చిదరించుకునే కాలం నుంచి దళితుల అభ్యున్నతికై ప్రత్యేక పథకాలను ప్రవేశ పెట్టి వారి జీవితాలను ఆనందమయం చేసే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చూరవ చూపడం ఎంతో అదృష్టకరమని పేర్కొన్నారు. 75ఏళ్ల నుంచి దళితులను ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని, తెలంగాణ ప్రభుత్వంలో దళితులతో పాటు అన్ని సామాజిక వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడం శుభసూచికమని జెడ్పీచైర్మన్ పద్మావతి అన్నారు. పార్లమెంట్‌కు సైతం అంబేద్కర్ పేరు పెట్టాలని తీర్మానం చేయడం హర్షించదగిన విషయమన్నారు. చారకొండను పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించడంతో లబ్ధిదారుల ఖాతాల్లోరూ.9.90లక్షల రుణాలు జమ చేయడమైందని, మిగిలిన రూ.10వేలు దళితుల రక్షణనిధిగా జమ చేయనున్నామని జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డీసీబీ అధ్యక్షులు నిజాంపా షా, అదనపు కలెక్టర్ మోతిలాల్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ రామ్‌లాల్, చారకొండ మండల ఎంపీపీ నిర్మల, సర్పంచ్ విజయేం దర్‌గౌడ్, జెడ్పీటీసీ విజితారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఉద్యోగులచే ప్రమాణం చేయిస్తున్న కలెక్టర్ షేక్ యాస్మిన బాషా



రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న జిల్లా అధికారులు



పోలీసు అధికారులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా ఎస్పీ అపూర్వరావు

**వనపర్తి ప్రతినిధి,నవంబర్ 26 ప్రభాతవార్త:** రాజ్యాగం పితామహుడు డా.బి.ఆర్ అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా 2015, నవంబర్ 26వ తేదీ నుండి భారత రాజ్యాంగ దినోత్సవంగా ప్రతి సంవత్సరం జరుపుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షేక్‌యాస్మిన్ బాష సూచించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయం ప్రాంగణంలో భారత రాజ్యాంగ దినోత్సవంను పురస్కరించుకొని జిల్లా అధికారులు, సిబ్బందితో జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డా.బిఆర్ అంబేద్కర్ 1949 నవంబర్ 26వ తేదీన భారత రాజ్యాంగాన్ని రూపొందించడం జరిగిందని ఆమె తెలిపారు. తాను రచించిన రాజ్యాంగంలోని హక్కులు, విధులు, బాధ్యతలు తూచా తప్పకుండా పాటించడం ద్వారా మన భారతదేశం అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగారూపొందిందని ఆమె తెలిపారు. భారత రాజ్యాంగాన్ని 1950 జనవరి 26వ తేదీన ప్రభుత్వం ఆమోదించడం జరిగిందని ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవంగా మనం జరుపుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా భారతదేశ ప్రజలమ మేము దేశంలో సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాంగం నెలకొల్పుకునేందుకు పౌరులందరికి సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయాన్ని, భావ ప్రకటన స్వేచ్ఛ, సమానత్వం, జాతి ఐక్యతకు, వ్యక్తి గౌరవానికి, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించేందుకు మనకు మనంగా రూపొందించుకున్నా భారత రాజ్యాంగాన్ని పాటించేందుకు కట్టుబడి ఉంటామని, సత్యనిష్ట పూర్వకంగా ప్రమాణం చేస్తున్నట్లు జిల్లా అధికారులు, సిబ్బందిచే జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. డా.బి.ఆర్.అంబేద్కర్ గొప్పతనాన్ని, సేవలను, హక్కులను, విధులను, బాద్యతలను, తూ.చా తప్పకుండా ప్రతి ఒక్కరు గుర్తుంచుకొని పాటించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా జాతీయ రాజ్యాంగ దినోత్సవం...**

**వనపర్తి క్రైమ్,నవంబర్ 26 ప్రభాతవార్త:** జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా పోలీసు కార్యలయంలో జిల్లా ఎస్పీ అపూర్వరావు ఘనంగా వేడుకలు నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డా.బీ.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి వారి సేవలను గుర్తు చేసుకొని స్మరించుకున్నారు. వందల ఏళ్లు బ్రిటీష్ పాలనలో ఉన్న భారతదేశానికి ఎందరో మహాత్ముల త్యాగ ఫలితంగా స్వాతంత్ర్యం సిద్ధించిందని స్వాతంత్ర్యం పొందిన మరో రెండేళ్ల కాలం తరువాత రాజ్యాంగ రూపకల్పన చేయడం జరిగిందని ఆమె తెలిపారు. రాజ్యాంగ నిర్మాణంలో డా.బీ.ఆర్ అంబేద్కర్ వంటి ఎంతో మంది మేధావుల కృషి ఉందని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం 1949 నవంబర్ 26న ఆమోదం పొందిన సందర్భంగా భారత రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. అనంతరం విధుల పట్ల అంకిత బావంతో, రాజ్యాంగబద్ధంగా నడుచుకుంటామని సిబ్బంది అందిరిచే ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ ఆనంద్ రెడ్డి, సీసీఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసాచారి, రిజర్వ్ ఇన్స్పెక్టర్ జగన్, కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం


అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు


రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు




**కల్వకుర్తి, నవంబర్ 26, ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనను కొనసాగించేందుకు యువత ముందుకు రావాలని ఆమనగల్లు సీఐ ఉపేందర్ అన్నారు. శనివారం భారత రాజ్యాంగం 73వ సంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమనగల్లు సీఐ ఉపేందర్, రిటైర్డు ప్రిన్సిపాల్ సుధాకర్‌లుహజరై అంబేద్కర్‌చిత్రపటానికి పలువురు నాయకులుతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించేందుకు కలిసికట్టుగా ప్రయాణిద్ధామని ప్రతిజ్ఞ చేశారు. భారత జాతి ఔనత్యాన్ని ప్రపంచంలోనే ప్రఖ్యాతి గాంచిన దేశంగా చూపించిన మహానీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని వారు కొనియాడారు. ఆయన భారతదేశానికి చేసినసేవలు మరువలేనివని, ఈనాడు ఆయన ప్రజలతో లేకున్న ఆయన రచించిన రాజ్యాం గ ఫలాలు ప్రతి నిత్యం భారతదేశ ప్రతి పౌరుడు పొందుతున్నాడని వారు గుర్తు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ఎల్లవేళలా భారతదేశ ప్రతి పౌరుడు కలిసికట్టుగా ఉండి కాపాడుకుందామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సదానందంగౌడ్,రాముడు, బాల్‌రాజ్, భీమేశ్వర్, పరశురాం, శ్రీనివాస్, మల్లేష్, అలీ, జుబేర్, రాజునాయక్, బాలయ్య, విద్యార్థులు ఉన్నారు.

**వెల్దండ, నవంబర్ 26, ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు చిందం కృష్ణయ్య, దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు కుర్మిద్ధ యాదగిరిలు అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాణం అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వెల్దండ మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి ప్రక్కన గల బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు నాయకులు మాట్లాడుతూ మన ఓటుతో రాజ్యాధికారంలోకి వచ్చిన అగ్రకులాల వారు మన హక్కులను కాలరాస్తున్నారని, ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలు చైతన్యవంతులై రాజ్యాధికారం సాధించే వరకు పోరాడాలన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని,ఆయన ఆశయ సాధనకోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల న్నారు. కార్యక్రమంలో నాయకులు గెల్వయ్య, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, కొండలు, విష్ణుగౌడ్, పర్వతాలు, శివ, నర్సింహ్మా, మురళి, గణేష్, మల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి, నాగులు, శివకుమార్‌తో పాటు తదితరులు ఉన్నారు.

**ఉప్పునుంతల,నవంబరు 26 ప్రభాతవార్త:** దేశ సమానత్వం, సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించే ప్రజాస్వామిక, గణతంత్ర రాజ్యాంగంగా ఎంతో ప్రసిద్ది పొందిన రాజ్యాంగం అమలు పరిచిన దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలో డా. బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల ప్రాథమిక బాలుర పాఠశాల ఆవరణలో భారత రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ భారత రాజ్యాంగ పీఠికను చదివి, భారత రాజ్యాంగం గొప్పదనాన్ని ప్రతిజ్ఞ ద్వారా వివరించారు. కార్యక్రమంలో తహసిల్దార్ శైలేంద్రకుమార్, ఎంపిడిఓ లక్ష్మణ్‌రావు, జడ్పీటిసి ప్రతాప్‌రెడ్డి, డిఎల్‌పిఓ వెంకటయ్య, సర్పంచ్ సరితానంతరెడ్డి, ఉప తహసిల్దార్ సరస్వతి, మండల పంచాయతీ అధికారి నారాయణ, స్థానిక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్టా నంతరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం కట్ట నర్సింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యాయులు శేఖర్ ముదిరాజ్, వెంకటలక్ష్మి, రాంచంద్రారెడ్డి, అంగన్‌వాడి కార్యకర్తలు అప్పోజు పద్మ, భార్గవి, సువర్ణమ్మ, పద్మ,సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

**తిప్పాపూర్‌లో:** భారత రాజ్యాంగం అమలు పరిచిన దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారత రాజ్యాంగ పీఠికను చదువుకుంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్‌ఎం రామస్వామి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడి కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**వెల్టూరు న్యూమూన్‌స్కూల్‌లో:** మండలంలోని వెల్టూరు గ్రామంలో శనివారం న్యూమూన్ స్కూల్ ఆవరణలో భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తూ భారత రాజ్యాంగ పీఠిక చదివి వినిపించారు. కార్యక్రమంలో ఆపాఠశాల కరస్పాండెంట్ నజీమా అజ్మిద్దిన్, హెచ్‌ఎం ఉప్పరి బాలరాజు, ఉపాధ్యాయులు పద్మ, అనిత, సువర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్ (నాగర్‌కర్నూల్),నవంబరు 26 ప్రభాతవార్త:** శనివారం ఉదయం కలెక్టర్‌లో అన్ని శాఖల అధికారులు వారి వారి కార్యాలయాలలో ఉద్యోగులు రాజ్యాంగ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. డా.బి.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగ స్ఫూర్తిని నలుదిశలా చాటుదామని జిల్లా బసి సంక్షే మ శాఖ అధికారి అనిల్ ప్రకాష్ పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్క రించుకుని జిల్లా బిసి సంక్షేమ మైనార్టీ సంక్షేమ గిరిజన సంక్షేమ శాఖల ఉద్యో గులతో ప్రతిజ్ఞ చేయించారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శని వారం ఆయన చాంబర్‌లో ఏర్పాటు చేసిన రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ కార్యక్ర మంలో పాల్గొన్నారు. ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.

**కల్వకుర్తి, నవంబర్ 26, ప్రభాతవార్త:** కల్వకుర్తి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బీస బాలరాజు ఆధ్వర్యంలో పాలమూరు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద 73వ రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డిలు హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లా డుతూ అంబేద్కర్ రాసినటువంటి 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల సమయం పట్టిందని, 1949 నవంబర్ 26న దేశ పెద్దలకు రాజ్యాంగాన్ని అందించారని, 1950 జనవరి 26వ నుంచి రాజ్యాంగం అమలులోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. రాజ్యాంగం ప్రకారమే దేశంలో పరిపాలన కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, సైదులుయాదవ్, అంజియాదవ్, దామోదర్‌రెడ్డి, జంగయ్య, బండి సుదర్శన్, రవి, చంద్రశేఖర్, బాలస్వామి, శ్రీహరి, అనిల్, జంగయ్య, కుర్మయ్య కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## వార్డు అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తా


సీసీ రోడ్డు పనులను ఆనంద్‌కుమార్‌తో కలిసి పరిశీలిస్తున్న కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులు

**కల్వకుర్తి, నవంబర్ 26, ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటి పరిధిలోని 7వ వార్డును ప్రజల సహకారంతో అన్ని విధాల అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని స్థానిక వార్డు కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులు అన్నారు. కల్వకుర్తి మున్సిపాలిటి ఎస్సీ ఎస్టీ నిధులతో 7వ వార్డులో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులు, టీఆర్ఎస్ పార్టీ నాయకులు బృంగి ఆనంద్‌కుమార్‌తో కలిసి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ పాలనలో మున్సిపాలిటిల అభివృద్ధికి మహార్ధశ చేకూరుతుందన్నారు. రానున్న రోజుల్లో 7వ వార్డును స్థానిక ప్రజా ప్రతినిధుల సహాయ సహకారంతో మరిన్ని నిధులతో సుందరంగా తీర్చిదిద్ధడానికి చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న ఎస్సీ వాడలోని సీసీ రోడు పనులు నిర్మించడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ శివకుమార్,కాలనీ వాసులు నీరటి మల్లేష్, దున్న సురేష్, గుండూర్‌రమేష్,అంలి,నరేందర్, రవి, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

## మురుగు కాల్వ నిర్మాణానికి భూమి పూజ


మురుగు కాల్వ నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, నవంబర్ 26, ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటిలోని 13వ వార్డులో తలసాని సౌజన్య జనార్ధన్‌రెడ్డి సారథ్యంలో మున్సిపల్ నిధులు రూ.5లక్షలతో మురుగు కాల్వ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహేద్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ సహకారంతో 13వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్నానని, వార్డు అభివృద్ధికి చైర్మన్ అన్ని విధాల సహాయసహకారాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ షాహేద్, మున్సిపల్ కౌన్సిలర్ ఎడ్మ బోజిరెడ్డి, టీఆర్ఎస్ పార్టీ నాయకులు నాగేష్‌గౌడ్, దుర్గయ్యగౌడ్, 13వ వార్డు కాలనీ వాసులు జంగయ్య, చంద్రశేఖర్, గోపాల్ తదితరులు ఉన్నారు.

## మృతుని కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటాం!


మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీటీసీ, నాయకులు

**వెల్దండ, నవంబర్26, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చెర్కూర్ గ్రామానికి చెందిన రమేష్ గత 5 రోజుల క్రితం అకస్మాత్తుగా మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని శనివారం జెడ్పీటీసీ ధ్యాప విజితారెడ్డితో కలిసి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రమేష్ కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని భార్యకు దళితబంధు అందించి ఆదుకోవాలని జెడ్పీటీసీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మొదటి విడతలో రమేష్ కుటుంబానికి దళిత బంధు అందించి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ధ్యాప ఆనంద్‌రెడ్డి, ఉప సర్పంచ్ నర్సింహ్మా ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ భీమయ్యగౌడ్, మైసయ్య, సత్యం, అలీ, శ్రీను, భిక్షపతి, కొండల్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## ఓటర్ నమోదును పరిశీలించిన ఆర్డీఓ


ఓటు నమోదును పరిశీలిస్తున్న రాజేష్‌కుమార్

**వెల్దండ, నవంబర్26, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఓటర్ల ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్‌తో కలిసి ఆర్డీఓ రాజేష్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ 18 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఓటు నమోదుకు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు మాసమ్మ, మేర్లిన్, పంచాయతీ కార్యదర్శి గిరి, ఆర్ఐ శంకర్, వీఆర్ఎ అంజి, శేఖర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## ఘనంగా బాలసభ



**ఉప్పునుంతల,నవంబరు 26 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా బాలసభ క్యాక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులే స్వయంగా కార్యక్రమాన్ని రూపొందించుకుని పాటలు, నృత్యాలు ఏకపాత్రాభినయాలు, పద్యాపఠనం, నాటకాలు,ఇంద్రజాలం, మిమిక్రీ లాంటి పలురకాల ప్రక్రియలలో వారివారి నైపుణ్యాలను ప్రదర్శించి పలువురిని ఆకట్టుకునేలా ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆ పాఠశాల హెచ్‌ఎం హనువ ంతురెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి బాలసభల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని భవిష్యత్తులో మరిన్ని సభలు పాఠశాలల్లో నిర్వహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు లక్ష్మారావు, శ్రీనివాసమూర్తి, అనురాధ, అనసూయ, సత్యనారాయణ, సతీష్, కల్పన, శ్యాంసుందర్‌గౌడ్, చంద్రశేఖర్, నాగేశ్వర్‌రావు, పర్వతాలు, శ్రీలత, అజీమ్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు సామాగ్రి పంపిణీ



**ఉప్పునుంతల,నవంబరు 26 ప్రభాత వార్త:** మండలంలోని మామిళ్ల పల్లి గ్రామంలో శనివారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు, టై, బెల్టు పంపిణీ చేశారు. అదే గ్రామానికి చెందిన చిరంజీవి సాయిమేఘన గురుకుల పాఠశాలలో చదువుకుంటూ మృతి చెందడంతో ఆమె జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ. 5 వేల విలువ గల నోట్‌పుస్తకాలు, వస్తుసామాగ్రి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వపాఠశాలలో చదు వుకుంటున్న విద్యార్థులు ప్రయోజకులు కావాలని వారు కోరారు. ఈ పంపిణీ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు వెంకటేష్, శ్రీనివాసులు, చంద్రయ్య, ఆ పాఠశాల హెచ్‌ఎం దీపికారెడ్డి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా మహాసభలకు తరలివెళ్తున్న కార్మికులు



**కల్వకుర్తి, నవంబర్ 26, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 4వ మహాసభలకు కల్వకుర్తి మండలం నుంచి భారీ సంఖ్యలోతరలివెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్య క్షులు బి.ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు అన్ని రంగాల ఉద్యోగులకు ఇచ్చినట్లు 30శాతం పీఆర్సీ అమలు చేయాలని, పీఎఫ్ ఈఎస్ఐతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తూ కనీస వేతనం నెలకు రూ.21వెయ్యి ఇవ్వాలని కోరారు. అధికారికంగా ఆదివారం, పండుగ సెలవు ఇవ్వాలన్నారు. తరలివెళ్లిన వారిలో మండల అధ్యక్షులుమహేష్, కార్యదర్శిశంకర్, నాయకులు పరుశ రాములు, కృష్ణమ్మ,మైసమ్మ,మంజుల,వెంకటయ్య, ఆంజనేయులు, రాజేష్; యాదయ్య,ఊర్కొండ,వెల్దండమండలాల నుంచిపెద్ధఎత్తునకార్మికులు తరలివెళ్లారు.

## శివస్వాములకు అన్నదాన కార్యక్రమం

**కల్వకుర్తి, నవంబర్ 26, ప్రభాతవార్త:** పవిత్రమైన కార్తీకమాసంలో శివ మాలలు ధరించిన శివస్వాములు భక్తి శ్రద్ధలతో శివునికి పూజలు నిర్వహిస్తారు. కల్వకుర్తి పట్టణంలోని వెంకటేశ్వర దేవాలయంలో గురుస్వామి కార్వంగ ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో శివమాలలు ధరించిన శివస్వాములకు మండల దీక్ష కాలం నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో భాగంగా శనివారం టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బృంగి ఆనంద్‌కుమార్, పట్టణ నాయకులతో కలిసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించిన బృంగి ఆనంద్‌కుమార్‌ను శివస్వాములు వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులు, నాయకులు లక్ష్మారెడ్డి, రమాకాంత్‌రెడ్డి, సురేష్, శివ, రమేష్, పరుశరాం, గురుస్వాములు రమేష్, రణవీర్, కృష్ణ,గోవర్ధన్‌రెడ్డి, నాగరాజు,కొండల్,రవి, అనిల్, గురుస్వాములు, స్వాములు తదితరులు ఉన్నారు.

## క్రికెట్ కిట్ అందజేత

**వెల్దండ, నవంబర్ 26, ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రానికి చెందిన యువకులకు, విద్యార్థులకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన క్రికెట్ కిట్‌ను శనివారం ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ క్రీడాకారులకు అందించారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడంతో పాటు యువతను సంఘటితం చేసి వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు యెన్నం విజయేందర్‌రెడ్డి, నాయకులు తంబాలంయాదవ్, క్రీడాకారులు బాదేపల్లి రమేష్, శ్రీనుగౌడ్, మల్లేష్, మురళి, పర్వతాలు, కుమార్,ఉమేష్,ఫౌండేషన్‌సభ్యులు రమేష్‌నాయక్, రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

**బాధితుడికి ఆర్థిక సహాయం:** మర్రిగుంత తాండ గ్రామ పంచాయతీ పరిధిలోని గాజులోనిబావితాండకు చెందిన రామావత్ రాజు రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు శనివారం రామావత్ రాజును పరామర్శించి ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.5వేలను ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి సర్పంచ్ శ్రీనునాయక్‌తో కలిసి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు సక్రునాయక్, దేశ్యనాయక్, ఫౌండేషన్ సభ్యులు మల్లయ్య, కొండలుయాదవ్, రమేష్‌నాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ విద్య

**కల్వకుర్తి, నవంబర్ 26, ప్రభాతవార్త:** ప్రభుత్వ బడుల్లో ప్రైవేటుకు ధీటుగా కార్పొరేట్ విద్యను ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ప్రభుత్వం గురుకులాలను ఏర్పాటు చేసి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి దోహద పడుతుందని ఎమ్మెల్యే సూచించారు. శనివారం కల్వకుర్తి పట్టణంలోని మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పరిశీలించారు. మినీ స్టేడియంలో విద్యాలయం కొరకు ఏర్పాటు చేస్తున్న మౌళిక వసతులను పరిశీలించి పనులను నాణ్యతగా త్వరితగతిన చేపట్టాలన్నారు. విద్యార్థుల కోసం వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

# పాఠశాలలపై దాడులు ఆపాలి : పిఆర్‌టియు

**మహబూబ్‌నగర్ (నాగర్‌కర్నూల్),నవంబరు 26 ప్రభాతవార్త:** పర్యవేక్షణ పేరుతో ప్రాథమిక పాఠశాలలపై జరుగుతున్న దాడులను ఆపాలని పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూర్య శ్రీనివాస్‌గౌడ్, తుమ్మల సురేందర్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఆగస్టు 15,2022 నుంచి ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ప్రారంభమైన దగ్గర నుంచి ప్రాథమిక పాఠశాలలపై మూకుమ్మడి దాడులు జరుగుతున్నాయన్నారు. పర్యవేక్షణ పేరుతో వివిధ స్థాయిల్లోని అధికారులు, అనధికారులు కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, ఎంఈఓ, మండల నోడల్, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు పాఠశాలల్లో జరుగుతున్న విద్యాబోధనను స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగనివ్వకుండా ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయుడికి కండిషనల్ టీచింగ్ అంటగట్టి లెస్సన్ ప్లాన్స్ మ్యానువల్‌గా వ్రాయాలని ప్రింటెడ్ ప్లాన్స్ పనికి రావన్నారు. ఇంతవరకు ఎటువంటి స్కూల్ గ్రాంట్స్ రాకున్నా టిఎల్ఎంను పెద్దఎత్తున ప్రిపేర్ చేయాలని, స్కావెంజర్స్ లేకున్నా పాఠశాల పరిసరాలు, టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండాలని, తరగతికి ఒక ఉపాధ్యాయులు లేకున్నా ఎఫ్ఎల్ఎన్ పకడ్బందీగా అమలు చేయాలని, పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయ లోకాన్ని మానసిక, శారీరక ఇబ్బందులకు గురిచేస్తూ విద్యా వ్యవస్థను అవస్థల పాలు చేస్తున్న ఎఫ్ఎల్ఎన్ పర్యవేక్షణ విధానాన్ని, అధికారుల మూకుమ్మడి దాడులు వెంటనే ఆపేయాలన్నారు. ఉపాధ్యాయులను స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యాబోధన చేసే విధంగా అవసరమైన విద్యా వనరులను ప్రభుత్వం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాఠశాలల్లో సరైన వసతులు కల్పించకుండా విద్యార్థులను సామర్థ్యాల పేరిట మానసిక ఒత్తిడి కలిగించడం సరైంది కాదన్నారు. జిల్లా టాస్క్ ఫోర్స్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి తమ సంఘం వ్యతిరేకం కాదని, ప్రాథమిక స్థాయిలో ఉన్న లోపాలను సరిచేసి పకడ్బందీగా అమలు చేసే కార్యక్రమం విజయవంతమవుతుందన్నారు. కావున వెంటనే బదిలీలు, ప్రమోషన్లు, డీఎస్సీల ద్వారా ఉపాధ్యాయులను నియమించి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తే ఈ కార్యక్రమం నూటికి నూరుశాతం సక్సెస్ అవుతుందన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతమవుతుందన్నరు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యా వ్యవస్థను కాపాడుకోవాల్సిందిగా కోరారు.

# ఆరోగ్య తెలంగాణ సాధనే టీఆర్ఎస్ ధ్యేయం


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ

**కల్వకుర్తి, నవంబర్ 26, ప్రభాతవార్త:** పోరాడి సాధించుకున్న ప్రత్యేక తెలం గాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అంచెలంచెలుగా రాష్ట్రాన్ని పురోగతి బాట పట్టి స్తున్నారని అధికార పార్టీ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శని వారం నాగర్‌కర్నూల్ జిల్లా జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ సోదరుడు సుధీర్‌సింగ్, కల్వకుర్తి పట్టణానికి చెందిన ఎండీ.సిరాజ్‌లకు రూ.2లక్షల చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి తన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్న తెలంగాణ సర్కార్ రాష్ట్రంలో పేద లకు ఆరోగ్య భరోసాను కల్పిస్తుందన్నారు.సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రం సుభిక్షంగా ముందుకు సాగుతుందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి అమలు తీరుపై ప్రశంసల వర్షం కురిపించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

### అచ్చంపేట ఆర్డీఓ పాండునాయక్


ఉప్పునుంతలలో ఓటరు నమోదు పత్రాన్ని స్వీకరిస్తున్న తహసీల్దార్

**ఉప్పునుంతల,నవంబరు 26 ప్రభాతవార్త:** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటుహక్కును వినియోగించుకోవాలని అచ్చంపేట ఆర్డీఓ పాండు నాయక్ సూచించారు. శనివారం మండల కేంద్రమైన ఉప్పునుంతల ప్రాథమిక పాఠశాలలో బూత్‌స్థాయి అధికారులు, అందించే సేవా కార్యక్రమాలను ఆర్డీఓ సందర్శించారు. అంతకు ముందు ఓటరు నమోదు ప్రక్రియను ప్రారంభించగా ఆర్డీఓ పరిశీలించారు. మండలంలో 34 బిఎల్ఓ కేంద్రాలలో 59 మంది ఓటర్లు నమోదు చేసుకున్నట్లు తహసిల్దార్ శైలేంద్రకుమార్ వివరించారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓతో పాటు తహసిల్దార్, ఉప తహసిల్దార్ సరస్వతి,ఎంపిడిఓ లక్ష్మణ్‌రావు,డిఎల్‌పిఓ వెంకటయ్య, మండల పంచాయతీ అధికారి నారాయణ, సర్పంచ్ సరితానంతరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్టానంతరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, పాఠశాల హెచ్‌ఎం నర్సింహారెడ్డి, అంగన్‌వాడి కార్యకర్తలు అప్పోజు, పద్మ, సువర్ణమ్మ, పద్మ, సరస్వతి తదితరులు ఉన్నారు.

# ఓటరు ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి


ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ సుబ్రహ్మణ్యం

**ఇటిక్యాల,నవంబరు 26 ప్రభాతవార్త:** మండల పరిధిలోని 49 పోలింగ్ బూతుల పరిధిలోని యువతీ, యువకులు 18 ఏళ్లు నిండిన వారంతా కొత్తగా ఓటు హక్కు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసిల్దార్ సుబ్రమణ్యం వివరించారు. శనివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా తహసిల్దార్ సుబ్రమణ్యం ఎర్రవల్లి చౌరస్తా, కొండేరు గ్రామాలలోని పోలింగ్ బూతులలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు నేడు,రేపు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదే విధంగా ఆర్ఐ ప్రశాంత్‌గౌడ్ ఎర్రవల్లి, గార్లపాడు, మునగాల తదితర గ్రామాలలోని ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమాన్ని పరిశీలించారు.శనివారం మొదటిరోజు ఓటరు ప్రత్యేక నమోదు కార్యక్రమంలో 49 పోలింగ్ బూతులలో 27 కొత్తదరఖాస్తులు, అలగే 14 మంది చనిపోయిన వారిని తిరస్కరించాలని దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమంలో బిఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక సాయం



**కల్వకుర్తి, నవంబర్ 26, ప్రభాతవార్త:** కల్వకుర్తి జేపీ నగర్ గురుకుల పాంశాలలో ఇంటర్మీడిట్ పూర్తి చేసుకున్న గడ్డం నవీన్ ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రదర్శ కనబరిచి మెడికల్ కళాశాలలో సీటు సంపాదించాడు. గడ్డం నవీన్‌కు చదువుకోవాలనే ఆసక్తి ఉన్న ఆర్థిక ఇబ్బందులు తోడు కావడంతో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు నవీన్‌ను పరామర్శించి ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి విద్యార్థి విద్యాభివృద్ధికి సమకూర్చిన రూ.10వేల ఆర్థిక సహాయాన్ని ఫౌండేషన్ సభ్యులు అందించారు. కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు హసన్, రాజు, గణేష్, భార్గవచారి, మల్లేష్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



**మదనాపురం, నవంబరు 26 ప్రభాతవార్త:** రాజ్యాంగ దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ నరేందర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం కార్యాలయ సిబ్బం దితో ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లా డుతూ సామాజిక న్యాయం స్వేచ్ఛ, సమా నత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలకు పెద్దపీట వేస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం రాసిన మహనుభావుడు అంబేద్కర్ అని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు దళిత సంఘాల ఆధ్వర్యంలో మాజీ మార్కెట్ ఛైర్మన్ వెంకట్‌నారాయణ, సర్పంచ్ రామనారాయణ, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు జగదీష్, మాజీ సర్పంచ్ వేమన, కోటేశ్వరరావు, చుక్క మహేష్, రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



**కొత్తకోట, నవంబర్ 26 ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తిని ప్రతి ఒక్కరు కొనసాగిం చాలని కొత్తకోట మున్సిపల్ ఛైర్మెన్ సుకేశిని విశ్వేశ్వర్ పిలుపునిచ్చారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకోని పట్టణం లోని అంబేద్కర్ విగ్రహాన్ని దళిత సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుకేశిని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆమోదింప జేసి నేటికి 73 సంవత్సరాలు పూర్తయిందని అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. అనంతరం ఆమె మున్సిపల్ కౌన్సిలర్ లచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ విశ్వేశ్వర్, కౌన్సిలర్లు రాములు యాదవ్, కొండారెడ్డి, పద్మ అయ్యన్న, సంధ్య రవీందర్ రెడ్డి, ఖాజమైనుద్దీన్, తిరుపతయ్య, కోఆప్షన్ సభ్యులు మిసేక్, వసీం, వహీద్, యాదగిరి, సుభాష్, హను మంతు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**దేవరకద్ర, నవంబరు 26 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి, దేవరకద్రలలో శనివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ మపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో అంబేద్కర్ విగ్రహానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు, జూనియర్ రెడ్‌క్రాస్ సమన్వయకర్త అశ్విని చంద్రశేఖర్, ఆయాపాఠశాలల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మురళీధర్, బాసిద్‌లతో పాటు ఉపాధ్యా యులు శ్రీనివాస్‌గూడ్, అంజనేయులు, అశ్విని చంద్రశేఖర్, కల్పన, రజియాబేగం, అహ్మద్‌బిన్ ఇశాక్, విద్యావాలంటీర్లు వెంకట్రాములు, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

**దేవరకద్రలో:** దేవరకద్రలోని భవిత డిగ్రీ కళాశాలలో శనివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ యువకేంద్ర ఇంచార్జి బాలకృష్ణ అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భారత రాజ్యాంగం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ జనార్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**పెబ్బేరు, నవంబర్ 26 ప్రభాతవార్త:** డా. బీ. ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం నేటితో 73 సంవత్స రాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. ఈకార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు గంధం రంజిత్ కుమార్, అంబేద్కర్ యూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో:** పెబ్బేరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో డా. బి. ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సంద ర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**వనపర్తి టౌన్, నవంబర్ 26 ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలోని ఎస్ఎమ్‌హెచ్ బాలికల హాస్టల్ విద్యా ర్థులతో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు భగత్ మాట్లాడుతూ రాజ్యాంగం ఆమోదించి నేటికి 72 ఏళ్ల పూర్తి అయిందని రాజ్యా ంగంలో పొందుపరిచిన ఆర్టికల్స్ ప్రకారం హక్కులు సాధించుకున్న రాజ్యాంగపలాలు అందరికి సమాన ంగా అందడం లేదని అన్నారు. పేదలు మరింత పేదలుగా ధనవంతులు మరింత ధనవంతులుగా ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని అలాగే భారత రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను పాలకులు రకరకాల కారణాలతో సవరణలు చేస్తూ ధనవంతులకు అనుకూలంగా చట్టాలు తయారు చేసుకుంటూ అసమానతల వ్యత్యాసాలు విపరీతంగా సృష్టిస్తున్నారని అన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చి తిరిగి మనుధర్మ శాస్త్రాన్ని అమలులోకి తేవాలని మనువాద పాలకులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. మను వాద సిద్ధాంతాన్ని పాఠ్యపుస్తకాల్లో ప్రవేశపెట్టి అసత్య ప్రచారాలను మూఢ విశ్వాలనాలను ప్రజలలో పెంపొందించి ఐక్యంగా ఉన్న ప్రజల మధ్య కుల, మత, ప్రాంత విబేధాలు రెచ్చగొడుతూ అల్లకల్లోలం సృష్టిస్తున్నారని అన్నారు. తూర్పు పొడుస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ అనగారిన వర్గాలకు రిజర్వేషన్ల సౌకర్యం లేకుండా చదువుకు సంపదకు రాజ్యానికి దూరం చేస్తున్నారని అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పరిరక్షించడం ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడడం కోసం రాబోయే కాలంలో సామాజిక ఉద్యమాలను ఉధృతం చేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో హాస్టల్ విద్యార్థులు, కెవిపిఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**వంగూరు, నవంబర్ 26, ప్రభాతవార్త:** భారత రాజ్యాంగానికి ఉన్న ఔనత్యం చాలా గొప్పదని దళిత శక్తి ప్రోగ్రామ్ నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షులు కొప్పు సురేష్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వంగూరు కేంద్రంలోని రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొప్పు సురేష్ మాట్లాడుతూ ప్రపంచంలోనే భారతదేశ రాజ్యాంగం అతిపెద్ద లిఖిత రాజ్యాంగమన్నారు. సోదర భావంతో మెలిగినప్పుడే స్వేచ్ఛ, సమానత్వం సాధ్యపడుతోందని, ప్రతి ఒక్కరు భారత రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాల న్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమేష్‌గౌడ్, నాయకులు లక్ష్మయ్య, ఎల్లగౌడ్, కృష్ణయ్య, మల్లేష్, సాయిలు, కృష్ణ, రమేష్, మహేష్ తదితరులు ఉన్నారు.

**ఇటిక్యాల, నవంబరు 26 ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ నిర్మాత డా. బి. ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం 73 ఏళ్లవుతున్నా దేశ ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పంచాయతీ కార్యదర్శి సరస్వతి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఉదండాపురం గ్రామంలో భారత రాజ్యాంగ దినోత్స వం పురస్కరించుకుని గ్రామ పంచాయతీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సరస్వతి మాట్లాడుతూ భారత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన మన రాజ్యాంగం సంపూర్ణ ఆమోదం పొందిందని దశాబ్దాల తర్వాత కూడా ఒక నమ్మకంతో భారత రాజ్యాంగం ప్రజల మదిలో నిలిచిపోయిందన్నారు. సర్పంచ్ అయ్యమ్మదానం, గ్రామస్తులు పాల్గొన్నారు.

**మక్తల్, నవంబరు 26 ప్రభాతవార్త :** జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోనిఅన్ని పోలీస్‌స్టేషన్లలో రాజ్యాంగ వేడుకలను ఘనంగా నిర్వ హించారు. భారత రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి సేవలను గుర్తు చేసుకుని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ కె. సత్యనారాయణ మాట్లాడుతూ వందల ఏళ్ల బ్రిటిష్ పాలనలో ఉన్న భారతదేశానికి ఎందరో మహాత్ముల త్యాగ ఫలితంగా స్వాతం త్రం సిద్ధించిందని, స్వాతంత్రం పొందిన మరో రెండేళ్ల కాలం తర్వాత రాజ్యాంగ రూపకల్పన చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీసులు, సిఐ సీతయ్య, ఆర్ఐ రాఘవరావు, ఎస్సైలు పర్వతాలు, జగదీశ్వర్, సునిత, అబ్జల్, డిపిఓ సూపరింటెండెంట్ శంకర్‌లాల్, స్టాఫ్, ఎస్‌బి, డిసిఆర్‌బి, ఐటికోర్ స్టాఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**శ్రీరంగాపురం, నవంబర్ 26 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన భారత రాజ్యాంగ దినోత్సవ వేడకలను పురస్క రించుకొని డా. బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అంబేద్కర్ అందించినటువంటి రాజ్యాం గంలోని హక్కుల గురించి అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షులు ఆశన్న ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్ ఇన్స్పెక్టర్ కె.టి మల్లేష్, సర్పంచ్ వినిలారాణి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షుడు లెక్చరర్ కురుమూర్తి మాట్లాడుతూ డా. బీ. ఆర్ అంబేదకర్ ప్రపంచ దేశాల్లో ఉన్నటువంటి రాజ్యాంగాలను, చట్టాలను చదివి భారత రాజ్యాం గం రచించడం జరిగిందని తెలిపారు. బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం భారతదేశ ప్రజలకు ఒక రక్షణ కవచంగా ఉందని, నేడు అందరం స్వేచ్ఛగా స్వతంత్రంగా సమాన హక్కుల గురించి మాట్లాడుతూ మనం ప్రజల హక్కుల కోసం స్వేచ్ఛగా ప్రశ్నిస్తున్నాము అంటే అది అంబేద్కర్ రచించిన రాజ్యాంగ పుణ్యమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు బి. కురుమయ్య, చుక్క నాగన్న, భజన పెంటయ్య, టీచర్ బాలచంద్రయ్య, బోయ బొక్కలయ్య, బిచ్చన్న ముదిరాజ్, జంగు కురుమయ్య, సుబ్బులు, కె. బీసన్న, బోడి హనుమంతు యాదవ్, డి. కురుమన్న, నాగరాల రాధాకృష్ణ, ఎస్. చంద్రయ్య, రాముడు, అనిల్, అర్జున్, దేవదాస్, బీసీ నాయకులు పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్, నవంబరు 26 ప్రభాతవార్త :** భారత రాజ్యాగం ప్రతి ఒక్కరి ఇంట్లోపెట్టుకోవాలని, పూజింపదగ్గది అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమావతి అన్నారు. జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవ అధికార సంస్థ శనివారం న్యాయసేవ సదన్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమావతి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిఒక్కరికి రాజ్యాంగంపై అవగాహన కల్పించడం వల్ల నేరాలు, ఘోరాలను ఆదిలోనే అంతంచేసిన వారమవుతామన్నారు. 200ల సంవత్సరాలు మన పూర్వీకులు పరదేశం వారి ఆధీనంలో ఉండి ఎన్నో బాధలు ఎన్నో కష్టాలతో పోరాడి స్వాతంత్రం సాధించిన తరుణంలో ఏ విధంగా భారతదేశాన్ని నడిపించాలి భిన్న కులాలు, భిన్న మతాలు ఉన్న దేశాన్ని ఒక్కతాటిపైకి తీసుకెళ్లాలంటే ఒక్కరోజులో రూల్ ఏర్పరిచి చేయలేరు కాబట్టి డా. బిఆర్ అంబేద్కర్ అధ్యక్షతన సభ్యులతో ఏర్పాటు చేసిన టీం రూపొందించిన భారత రాజ్యాంగం అన్నింటిని బ్యాలెన్స్ చేస్తూ ఇండియాని నడిపించే రాజ్యాంగం రచించారన్నారు. అందరు ఏ మతం వారైనా ఇండియన్స్ అందరు కూడా పూజింపదగ్గ రాజ్యాంగం అన్నారు. అనంతరం లా విద్యార్థులకు డిగ్రీ విద్యార్థులకు క్విజ్ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్, సంధ్యారాణి, సీనియర్ సివిల్ జడ్జి మహబూబ్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అనంతరెడ్డి, న్యాయమూర్తులు పిపి జనార్ధన్, న్యాయవాదులు లా కళాశాల విద్యార్థులు, డిగ్రీ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# పంచాయతీ రాజ్ డీఈని వెంటనే సరెండర్ చేయండి

- ◆ క్రిమిటోరియం క్వాలిటీ సర్టిఫికేట్ ఇవ్వడానికి రూ.5వేలు లంచం డిమాండ్ చేయడంపై సర్పంచ్‌ల ఏకగ్రీవ తీర్మానం
- ◆ మన ఊరు మన బడి పనులను వేగవంతం చేయండి
- ◆ మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మేఘారెడ్డి
- ◆ వెల్టూరు బీసీ బాలికల గురుకుల పాఠశాల పై చర్చ!

**పెద్దమందడి, నవంబర్ 26 ప్రభాతవార్త:** సర్పంచులు గ్రామాల్లో చేప ట్టిన వివిధ అభివృద్ధి పనులు స్మశాన వటికలు, ఇతర క్రిమిటోరియం పనులకు సరైన సమయంలో బిల్లులు రాక ఎంతో ఇబ్బందులకు గురౌతున్నారు. కొంత మంది సర్పంచులు అప్పులు తెచ్చి పనులు చేసి బిల్లులు రాక వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న ప్పటికీ అధికారులు పర్సెంటేజీల పేరుతో సర్పంచులను వేధించడ మేంటని ప్రశ్నించారు. శనివారం ఎంపీపీ మేఘారెడ్డి అధ్యక్షతన పెద



సర్వసభ సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు



మండల సర్వసభ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మేఘారెడ్డి

మందడి మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమీవేశంలో కొంత మంది సర్పంచులు పంచాయితీ రాజ్‌శాఖలో క్వాలిటీ కంట్రోల్ డీఈ గా ఉన్న అబ్దుల్ గఫార్ అనే అధికారి రూ.5వేలు ఇస్తే తప్ప క్రిమిటోరియం క్వాలిటీ సర్టిఫికేట్లపై సంతకాలు చేయనని బహాటంగా చెప్పడం పై సర్పంచులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ మేఘారెడ్డి ఆధ్వర్యంలో సభ్యులందరు డీఈ అబ్దుల్ గఫార్ ను వెంటనే ఆ శాఖకు సరెండర్ చేయాలని మండల సర్వసభ్య సమా వేశం ఏకగ్రీవ తీర్మానం చేసింది. అనంతరం మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న వివిధ పాఠశాలల భవన నిర్మాణాలు నత్తనడకన కొనసాగుతున్నాయని ఆ పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఏఈ కవి రెడ్డి ని ఎంపీపీ ఆదేశించారు. టెండర్ల ద్వారా మన ఊరు మన బడి పనులను తీసుకున్న కాంట్రాక్టర్లు వెంటనే పనులను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం వెల్టూరు దగ్గర ఇటీవల ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిబా పూలె బీసీ బాలికల గురుకుల పాఠశాలలో కొన్ని అవకతవకలు జరుగుతున్నాయని సిబ్బంది నియామకం, విద్యా ర్థులను జాయిన్ చేసుకునే విషయంలో డబ్బుల రూపంలో అవినీతి చోటుచేసుకుంటుందని సభ్యులు ఆరోపించగా ఎంపీపీ మాట్లాడుతూ సిబ్బంది నియమకం, విద్యార్థుల జాయినింగ్ కు సంబందించిన పూర్తి వివరాలను ఇవ్వాలని ప్రిన్సిపల్ సుభాన్‌ఖాన్ ను ఆదేశించారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాకల పనితీరు ప్రగతి నివేదికను ఆయా శాఖల అధికారులు సభ ముందు ఉంచారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రఘుపతి రెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, ఎంపీడీఓ అబ్జలుద్దీన్, మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



వెల్టూరు బీసీ బాలికల పాఠశాల ప్రగతిపై మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సుభాన్ ఖాన్

## 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలి

● అదనపు కలెక్టర్ మోతిలాల్

**మహబూబ్‌నగర్ (నాగర్‌కర్నూల్), నవంబరు 26 ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితా సవరణలో భాగంగా ఈ శని, ఆదివారం ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. శనివారం ఆయన నాగర్‌కర్నూల్, పెద్దకొత్తపల్లి మండలాల్లోని పెద్ద ముద్దునూరు, చందుపట్ల, చంద్రకల్ పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి ఓటరు నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటు హక్కును నమోదు చేసు కోవాలని భారత రాజ్యాంగం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరు వినియోగించుకోవాలన్నారు. పెద్ద ముద్దునూరు ఉన్నత పాఠశాలలో రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులను కాపాడే బాధ్యత అందరిపై ఉందని అదనపు కలెక్టర్ తెలిపారు. భారత రాజ్యాంగ దినోత్సవం డా. బిఆర్ అంబే ద్కర్ చిత్రపటానికి పూలమాలతో అలంకరణ చేసి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం గొప్పదనం గురించి ఎంత చెప్పినా తక్కువేనన్నారు. ప్రపంచంలోనే అత్యధిక ఓటర్లు ఉన్నదేశం మనదని, అంతమంది ఓటర్లతో సాధారణ ఎన్నికలు ఎంతో సులభంగా, ప్రశాంగా పూర్తి



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

చేస్తున్నామన్నారు. అందుకుమనరాజ్యాంగమే కారణమని, రాజ్యాం గాన్ని రచించిన డా. బాబాసాహెబ్ అంబేద్కర్ గొప్పతనాన్ని, సేవల ను తప్పకుండా ప్రతిఒక్కరు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. వారు అందించిన ఈ ఫలాలే ఈ రోజు దేశం అభి వృద్ధిలో ముందుకు వెళ్లడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రజలకు కల్పించిన విలువలు, హక్కులను కాపాడే బాధ్యత మనందరిపై ఉన్నదని, తప్పకుండా చేసే ప్రతి పనిలో ఆ అంశాన్ని గుర్తు పెట్టుకుని రాజ్యాంగబద్ధంగా కంకణబద్ధులై పని చేయాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజయ్య, విద్యా ర్థులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు. చంద్రకల్ వరి కొను గోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు.

## ఎన్‌సిసి క్యాండెట్స్ సమాజానికి ఆదర్శంగా నిలవాలి

● వనపర్తి జిల్లా కలెక్టర్ షేక్‌యాస్మిన్ బాష

**వనపర్తి ప్రతినిధి, నవంబర్ 26 ప్రభాతవార్త:** సమాజంలో క్రమశిక్షణ, జాతీయ భావం కలిగేలా క్యాండెట్స్ పని చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాష సూచించారు. శనివారం వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో 74వ ఎన్‌సీసీ దినోత్సవం వేడుకలకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐక్యతకు, క్రమశిక్షణకు, జాతీ య భావం పెంపొందించేందుకు ఎన్‌సీసీ పేరుగాంచిందని ఆమె అన్నారు. ప్రస్తుత సమాజంలో నైతిక విలువలు తగ్గుతున్న నేపథ్య ంలో ఎన్‌సీసీ క్యాండెట్స్ సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆమె సూచించారు. సమాజంలో క్రమశిక్షణ, జాతీయభావం తీసుకువచ్చేం దుకు కృషి చేయాలని ఆమె తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఐఈఓ జాకీర్ హుస్సేన్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగాయిత్రి, బాలికలఉన్నత పాఠశాల ఉపాధ్యా యులు, ఎన్‌సీసీ కమాండెంట్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలి

● ప్రతి బూత్ కమిటీకి ఒక ఇంఛార్జిని నియమిస్తాం: జడ్పీవైస్ ఛైర్మన్ వామన్‌గౌడ్

**కొత్తకోట, నవంబర్ 26 ప్రభాతవార్త:** ప్రభుత్వం బలహీన వర్గాల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు అంది వ్వడంతో పాటు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని పార్టీకి నిబద్ధతతో పని చేసే కార్యకర్తలను ఎమ్మెల్యే, టీఆర్ఎస్ పార్టీ అధి ష్ఠానం తప్పకుండా గుర్తిస్తుందని వచ్చే ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీల ఎత్తుగడులను చిత్తు చేయాలని జడ్పీవైస్ ఛైర్మెన్ వామన్ గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని రాఘవేంద్రస్వామి కళ్యాణ మండపంలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం కష్టపడుతూ నాయకులపు పార్టీ ఎప్పటికి గుర్తిస్తుందని, పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని అన్నారు. ప్రతి బూత్ కమిటీకి ఒక ఇన్చార్జ్ చొప్పున నియమిస్తా మని, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు గడపగడపకు తీసుకెళ్లాలని అన్నారు. ఓటర్ జాబితాను నిశ్చిప్తంగా పరిశీలించా లని, కొత్త ఓటర్లను చేర్పించేందుకు గ్రామాలలో ఉండే ముఖ్య నాయకులు ముందుకురావాలని అన్నారు. కొత్త ఓటర్లను చేర్పిన



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ వైస్ ఛైర్మన్ వామన్ గౌడ్

వారిని టీఆర్ఎస్ పార్టీకే మొదటి ఓటు వేసే విధంగా ప్రోత్స హించాలని అన్నారు. కార్యక్రమంలో సీడీసీ ఛైర్మెన్‌చెన్నకేశ వరెడ్డి, ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి ప్రశాంత్, సింగిల్‌విండో ఛైర్మెన్ కొంతం వాసుదేవా రెడ్డి, మండల రైతు సంఘం అధ్యక్షులు గిన్నె కొండారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గుంత మల్లేష్, మండల ప్రదాన కార్యదర్శి బాలకృష్ణ, శ్రీను జీ, హనుమంతురెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, అల్లాబాష, నరసింహ గౌడ్, సంజీవరెడ్డి, తిరుపతయ్య గౌడ్ , గోవిందు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరస్థులతో జాగ్రత్త : ఎస్ఐ

**శ్రీరంగాపురం, నవంబర్ 26 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నాసానిపల్లి గ్రామంలోని ప్రజలకు, వ్యాపారస్తులకు, విద్యార్థులకు ప్రతి ఒక్కరు సైబర్ నేరాలు/నేరస్తులతో అత్యంత జాగ్రత్తగా ఉండా లని ఎస్సై కెటి మల్లేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బ్యాంక్ నుండి ఫోన్ చేస్తున్నామని మీ ఏటీఎమ్ కార్డ్ నెంబర్ అడుగుతుంటారు ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దని మీకు ఫోన్ చేసి మీ ఫోన్ కు ఓటీపీ వచ్చింది చెప్పమని అడుగుతుంటారు ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దని ఆయన సూచించారు. ఫోన్ పే/గూగుల్ పే/పేటీయం ద్వారా డబ్బులు చెల్లిస్తామని తెలిపి నకిలీ యాప్ ద్వారా పంపిస్తూ అమౌంట్ క్రెడిట్ అయిందని చూపిస్తారు కానీ అవి మనకు రావు తప్పనిసరిగా మన అకౌంట్ చెక్ చేసుకోవాలని అన్నారు. కొత్త వ్యక్తులు మన దగ్గరకు వచ్చి డబ్బులు అవసరం ఉంది తన ఫోన్ నుండి పంపిస్తామని తెలిపి మనకు పంపకుండానే మనతో డబ్బులు తీసుకెళ్తుంటారు అందుకే అలాంటి సందర్భంలో కూడా అకౌంట్ చెక్ చేసుకోవాలని ఆయన తెలిపారు. కానీ కొందరు నేరగాళ్లు సెల్‌ఫోన్ దొంగలించి అట్టి ఫోన్ నుండి డబ్బులు సెండ్ చేసి మీతో తీసుకుపోతారు. వ్యాపారులు ముఖ్యంగా మీ దగ్గరకు వచ్చిన కస్టమర్లు ఫోన్ పే/ గూగుల్ పే ద్వారా డబ్బులు చెల్లిస్తారు తప్పకుండా మీ అకౌంట్ చెక్ చేసుకోవాలని ఆయన సూచించారు. స్పీకర్ మెసేజ్‌లు షాప్‌లో పెట్టుకోండని ఆయన సూచించారు. ఆన్‌లైన్ గేములు/ బెట్టింగ్స్ మొదలైన వాటికి దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై చాలా జాగ్రత్తగా ఉండాలని ఏదైనా సైబర్ నేరం జరిగిన వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ 1930 కి గాని 100కు గాని కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్ ఆంజనేయులు, ఉపసర్పంచ్ కవిత, డీలర్ నాగరాజు, ఎల్లయ్య, బాబు నాయుడు, శేఖర్, వెంకట్ నరసింహ, రాజ్‌గౌడ్, డోజర్‌శేఖర్‌యాదవ్, సుగ్రీవుడు, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ఉప్పునుంతల, నవంబరు 26 ప్రభాతవార్త:** మండలంలోని కంసా న్‌పల్లి గ్రామానికి చెందిన బొల్లు రాములుయాదవ్ (35) రోడ్డు ప్రమా దంలో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల కథనం ప్రకారం శుక్రవారం సాయంత్రం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి రాత్రివేళలో తిరిగి టిఎస్ 31 4771 నంబర్ గల ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వస్తుండగా కంసాన్‌పల్లి తండా మార్గంలో గ్రామ సమీ పంలో గల మూలమలుపు వద్ద చెట్టును ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు వివరించారు. రాత్రి పొద్దుపోయే వరకు ఇంటి కి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు గ్రామస్తుల సహకారంతో శుక్రవారం రాత్రి ఎంత వెతికినా ఫలితం లేకుండా పోయింది. శనివారం ఉదయం అదే మార్గం గుండా వెళ్తున్న వారికి మృతదేహం కనిపించడంతో వెంటనే కుటుంబ సభ్యులకు తెలియ జేశారు. అతివేగంగా వచ్చి చెట్టుకు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు వివరించారు. మృతునికి తల్లి మణెమ్మతో పాటు భార్య చంద్రకళ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘ టనతో కంసాన్‌పల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వ్యవసాయ పనులు చేసుకుంటూ అందరితో కలిసి మెలిసి ఉంటూ అకాల మరణం చెందడం పట్ల కుటుంబ సభ్యులతో పాటు గ్రామ స్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. భార్య చంద్రకళ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

**మృతునికి కుటుంబానికి అండగా నిలుస్తా: అచ్చంపేట మాజీఎమ్మెల్యే వంశీకృష్ణ...** కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా పాల్గొం టూ పార్టీ కోసం పనిచేసి అకాల మరణం చెందడం దురదృష్టకరమని రాము లు యాదవ్ కుటుం బానికి కాంగ్రెస్‌పార్టీ



అండగా నిలుస్తుందని అచ్చంపేట మాజీఎమ్మెల్యే డా. వంశీకృష్ణ అన్నారు. శనివారం కంసాన్‌పల్లి గ్రామంలో మృతదేహం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు కట్టానంతరెడ్డి, గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఉన్నారు.

## ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

**పెబ్బేరు, నవంబర్ 26 ప్రభాతవార్త:** 2023 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తి అయిన ప్రతి యువత ఓటు జాబి తాలో తమ పేరు నమోదు చేసుకోవాలని డిప్యూటీ తహసిల్దార్ విజయసింహా ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కలెక్టర్ షేక్‌యాస్మిన్ బాష ఆదేశాల మేరకు ప్రత్యేక కేంద్రాలలో నవంబర్ 26, 27వ తేదీన అదే విధంగా డిసెంబర్ 3,4వ తేదీల్లో ప్రతి పోలింగ్ బూత్ లో బీఎల్ఓ లు ఉండి ఓటరు నమోదు కార్యక్రమం చేపడతారని తెలి పారు. ఓటరు నమోదుకు తమ సమీపంలోని పోలింగ్ స్టేషన్ కు తగిన ధృవపత్రాలతో వెళ్లి వయస్సు నిర్ధారించే ధ్రువపత్రాలు, ఆధార్, ఫోటో వంటివి తీసుకెళ్లి ఫారం-6 తీసుకొని పూరించి బిఎల్ ఓ కు ఇవ్వాలని తెలిపారు. జనవరి 1, 2023 నాటికి 18 సంవత్స రాల వయస్సు పూర్తి కానున్న వారు ఇప్పటికే 18 సంవత్సరాల వయస్సు పూర్తి అయిన వారు దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు ఈ ప్రత్యేక క్యాపెయిన్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతేక క్యాంపెయిన్ రోజుల్లో బీఎల్ఓ లు ఉదయం 9గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉంటారని అన్నారు. ఓటరు నమోదుకు ఆన్‌లైన్ ద్వారా కానీ ఫారం-6 ద్వారా కానీ తమ పేరును ఓటరుజాబితాలోనమోదుచేసుకోవాలని అన్నారు. జాబితాలో మార్పులు చేర్పులు చనిపోయిన ఓటర్ల పేర్ల తొలగింపు, పోలింగ్ స్టేషన్ మార్పు వంటికి సైతం ఈ ప్రత్యేక క్యాంపెయిన్ నమోదు చేసుకోవాలని డిప్యూటీ తహసిల్దార్ విజయసింహ తెలిపారు.

## కౌకుంట్లలో ఓటరు నమోదు ప్రారంభం

**దేవరకద్ర, నవంబరు 26 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం కౌకుంట్లలో శనివారం ఓటరునమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు విషయంలో గ్రామస్థులకు బిఎల్ఓలు అవగాహన కల్పించారు. 18 ఏళ్ళు నిండిన వారందరూ ఈ అవకాశాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు గ్రామస్థులకు, యువకులకు సూచించారు.

## కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణీ రద్దు

**దేవరకద్ర, నవంబరు 26 ప్రభాతవార్త:** వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణీ పోర్టల్‌ను రద్దు చేస్తామని టీపీసీసీ కార్యదర్శి మధుసూధన్‌రెడ్డి(జియంఆర్) అన్నారు. అలాగే భూసమస్యలన్ని పరిష్కరిస్తామన్నారు. రైతులందకి పట్టాలు అందజేస్తామన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ కాంగ్రెస్‌కు అండగా నిలువాలని మధుసూధన్‌రెడ్డి కోరారు.

## పట్టుబడిన నల్లబెల్లం: కేసు నమోదు

**ఉప్పునుంతల, నవంబరు 26 ప్రభాతవార్త:** మండలంలోని కంసాన్ పల్లి, కొరిటికల్ గ్రామంలో శుక్రవారం రాత్రి పట్టుబడిన నల్లబల్లం అక్రమంగా రవాణా చేస్తున్న తిప్పాపూర్ తండాకు చెందిన ముడావత్ రాజుపై కేసు నమోదు చేసిన ట్లు ఎక్సైజ్‌శాఖ ఎస్సై బాలవర్ధన్‌రెడ్డి తెలిపారు. అక్రమంగా తరలిస్తూ బోల్తా పద్దవాహనంలో 9 బస్తాలలో 270 కేజీల బెల్లం లభించినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. పట్టుబడిన నల్లబెల్లంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి నట్లు ఎస్సై వివరించారు.

## ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక సాయం

**కల్వకుర్తి, నవంబర్ 26, ప్రభాతవార్త:** కల్వకుర్తి జేపీ నగర్ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడిట్ పూర్తి చేసుకున్న గడ్డం నవీన్ ఇటీవల వెలు వడిన నీట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రదర్శ కనబరిచి మెడికల్ కళాశా లలో సీటు సంపాదించాడు. గడ్డం నవీన్‌కు చదువుకోవాలనే ఆసక్తి ఉన్న ఆర్థిక ఇబ్బందులు తోడు కావడంతో ఐక్యత ఫౌండేషన్ సభ్యు లు నవీన్‌ను పరామర్శించి ఫౌండేషన్ ఛైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి విద్యార్థి విద్యాభివృద్ధికి సమకూర్చిన రూ.10వేల ఆర్థిక సహాయాన్ని ఫౌండేషన్ సభ్యులు అందించారు. కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు హసన్, రాజు, గణేష్, భార్గవచారి, మల్లేష్ తదితరులు ఉన్నారు.

## తిమ్మప్పస్వామి దేవాలయంలో అన్నదానం

**మల్దకల్, నవంబరు 26 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా ప్రసిద్ధ పుణ్య క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాల యంలో శనివారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. దేవాలయానికి వచ్చిన భక్తులకు తాటికుంట గ్రామానికి చెందిన పల్లా తిమ్మయ్యశెట్టి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ ఛైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి, అర్చ కులు రవి ఆచారి పూజలు నిర్వహించి ప్రారంభించారు. కార్య క్రమంలో మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రావు, జంగంశేఖరయ్య, పద్మారెడ్డి, బాదామి శ్రీనివాసులు, మద్దెలబండ నాగరాజు, ప్రవీణ్, హార్మోనిస్టు రాఘవేంద్రచారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జగత్పల్లి ఓటరు నమోదు కేంద్రాన్ని తనిఖీ చేసిన జేసీ



**పెద్దమందడి, నవంబర్26 ప్రభాతవార్త:** మండల పరిధి లోని జగత్పల్లి గ్రామంలో శనివారం ఓటరు నమోదు కేంద్రాన్ని జేసీ వేణుగోపాల్ తనిఖీ చేశారు. 18 సంవ త్సరాలు పూర్తి అయిన యువతీ, యువకులు కొత్త ఓటర్లుగా నమోదు చేసుకో వాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల వారీగా అర్హులైన నూతన ఓటర్లను గుర్తిం చాలని అలాగే 18 సంవత్సరాలు నిండిన ట్రాన్స్‌జెండర్లను ఓటర్లుగా నమోదు చేయాలని ఆయన సూచించారు. ఫామ్-6 ద్వారా కొత్త ఓటర్ల నమోదో ఫామ్-6(బి) ద్వారా, ఫామ్-7, ఫామ్-8 ద్వారా ఓటర్ల జాబితాలో వివరాల మార్పులు చేర్పులు చేయాలని ఆయన బూత్ లెవల్ అధికారులైన అంగన్వాడీ కార్య కర్తలకు సూచించారు. ఇంటింటికి వెళ్లి సర్వే ద్వారా ఓటర్ నమదు చేయాలని, అర్హులైన వారందరు ఓటర్ గా 100% నమోదు పూర్తి చేయాలనిజేసీ ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్య కర్తలు, నాగలక్ష్మీ, రాఘవేంద్రమ్మ, రమాదేవి, తదితరులు ఉన్నారు.